క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణం

బుచ్చినాయుడుకండ్రిగ: వెదురుకుప్పం మండలం దేవళంపేట సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమని, ఈ ఘటనలో దోషులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకులతో మాట్లాడుతూ ఇలాంటి చర్యలు అప్రజాస్వామికమని, ఈ దుర్చర్యలకు పాల్పడిన దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆరాచాలకు హద్దులేకుండా పోతుందని, దోషులను అరెస్టు చేయకపోతే ఆందోళనలు, ధర్నాలు చేపట్టు తామని హెచ్చరించారు.

చెత్త సేకరణపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం బుచ్చినాయుడు కండ్రిగలో గ్రామ కార్యదర్శి పెంచలయ్య ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగు



ఏర్పేడు: మండలంలోని మర్రిమంద దళితవాడ రాములవారి వీధిలో చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని, అధికారులు స్పందించి సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడులోని దళితవాడలో లో వోల్టేజీ సమస్య పరిష్కారమైంది. కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ట్రాన్స్‌కో ఏఈ చలపతి, సర్పంచ్ రత్నమ్మ, గ్రామస్తులతో కలసి ప్రారంభించారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో దళితవాడలో లోవోల్టేజీ సమస్య తీరిందని ఏఈ తెలిపారు. లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు లోవోల్టేజీ సమస్య తీరడంతో సంతోషంగా ఉందని దళితులు తెలిపారు.

గరుడ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు



గరుడ వాహనంపై ప్రసన్న వెంకన్న

రేణిగుంట: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పెరటాసి నెల మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలోని మూల విరాట్‌కు విశేషాభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారు. మూడో శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై మంగళ వాయిద్యాలు, భజనల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు. శ్రీబాలాజీ భక్తి సేవా సంఘం సభ్యులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

నాడి పట్టేవారు కరువు..

రోగికి లేదు ఆదరువు

చిన్న పాండూరులో వైద్యం కోసం వేచివున్న రోగులు



అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. పల్లెల్లో వైద్యులు అందుబాటులో ఉండాల్సిన సమయం.. కూటమి నిర్లక్ష్యం.. పరిష్కారానికి నోచుకోని డాక్టర్ల సమస్యలు.. న్యాయమైన కోర్కెలు తీర్చాలని సమ్మెలో వైద్యులు.. మూత పడిన పీహెచ్‌సీలు.. పల్లె జనానికి జర్వం వస్తే మందుబిళ్లలు ఇచ్చే వారు కరువు..వెరసి.. పల్లె వైద్యం కనుమరుగు.. ఫలితం రోగికి ఆదరువు లేక అవస్థల జీవనం .. వ్యాధులతో తప్పని పోరాటం.. విధిలేక ప్రైవేటులో చికిత్సలు.. పేదవాడిపై తప్పని ఆర్థిక భారం. ఇదీ నేడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి.

- సమ్మెలో వైద్యులు
- గ్రామీణులకు అందని వైద్యం
- పీహెచ్‌సీల్లో ఆగిన ఓపీ సేవలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న కేవీబీపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గది





తెరుచుకోని చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గది, పీహెచ్‌సీకే పరిమితమైన 104 వాహనం

వరదయ్యపాళెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు సమ్మె బాట పట్టారు. గత సెప్టెంబర్ 26వ తేదీ నుంచి వైద్యులు తమ డిమాండ్ల సాధన కోసం ఓపీ సేవలను పూర్తిగా నిలిపివేస్తూ నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీంతో గత వారం రోజులకు పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు ఆగిపోయాయి. దీంతో వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న రోగులకు స్టాఫ్ నర్సు, ఇతర కిందిస్థాయి వైద్య సిబ్బంది నుంచి నామమాత్రపు వైద్యసేవలు చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా అన్నీ కేంద్రాల్లో వైద్యసేవలు ఆగిపోయాయి.

అవస్థలు పడుతున్న పేద ప్రజలు

గత వారం రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యులు రాకపోవడంతో వైద్యం కోసం పేద ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే వర్షాకాలం మొదలవడంతో పలుచోట్ల జ్వరాల బారిన పడిన స్థానిక ప్రజలకు వైద్యం అందక ఇబ్బందిపడుతున్నారు. ఎంతో ఆత్రుతగా వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న ప్రజలకు వైద్యం అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఆగిన 104 సేవలు

వైద్యులు సమ్మె బాట పట్టడంతో 104 సేవలు పూర్తిగా ఆగిపోయాయి. సంబంధిత 104 వాహనాలు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరిమితమయ్యాయి. అటు గ్రామీణ స్థాయిలో, ఇటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యసేవలు ఆగిపోవడంతో ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు.

దోపిడీ చేస్తున్న ప్రైవేటు, ఆర్ఎంపీ వైద్యులు

వైద్యులు సమ్మె బాట పట్టడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు ఆగిపోయాయి. ఇక చేసేది లేక అనారోగ్యం బారిన పడిన రోగులు ప్రైవేటు వైద్యం కోసం వెళుతున్నారు. దీన్ని అదనుగా భావించిన ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు సైతం అతిక్రమించి ఇష్టారాజ్యంగా వైద్యం చేస్తూ దోపిడీ చేస్తున్నారు. చిన్నపాటి జ్వరం, జలుబుకు సైతం ఎక్కువ మోతాదులో మందులు ఇస్తూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కూలీనాలీ చేసుకుంటున్న పేదల నుంచి రూ.వేలకు వేలు లాక్కుంటున్నారు.

అత్యవసర సేవలకు పీజీ విద్యార్థులు

అయితే పలు పీహెచ్‌సీలకు అత్యవసర వైద్యసేవలు అందించడం కోసం తాత్కాలికంగా ఒక్కో పీహెచ్‌సీకి ఒక్కో పీజీ వైద్య విద్యార్థిని కేటాయించారు. అయితే వారు నామమాత్రంగా విధులకు హాజరవుతున్నారు తప్ప పూర్తిస్థాయిలో విధులకు హాజరుకాలేదు. అంతేకాక వైద్యం చేయడానికి వారు సాహసించడం లేదు. రోజువారీ ఒక్కో పీహెచ్‌సీకి 150 నుంచి 200లకు పైగా ప్రజలు వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయిస్తారు. అయితే వీరందరికీ ప్రస్తుతం వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.



నాగలాపురంలో ఓపీ సేవలందిస్తున్న పీజీ విద్యార్థి

వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరింపజేయాలి



వైద్యుల సేవలను గుర్తించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది. వైద్యులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం తీరు బాధాకరం. గత వారం రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు ఆగిపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్యుల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటు. తక్షణమే ఆ శాఖా మంత్రి స్పందించి వైద్యుల డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించి యథావిధిగా ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తేవాలి.

–నూకతోటి రాజేష్, సమన్వయకర్త, సత్యవేదు నియోజకవర్గం

శాస్త్రోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి విశేషాలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యాన్నదానికి రూ.1,00,116 విరాళం



ఈఓ బాపిరెడ్డికి విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన ముక్తేశ్వర్, నాగరాణి సుముఖ్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈఓ బాపిరెడ్డి స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్య విద్య'

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలోని అనస్తీషియా, కార్డియాలజీ, సిటీ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పద్మావతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో ప్రత్యేక సదస్సుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. కార్డియాలజీ, సీటీ స్కాన్, సర్జరీ, అనస్తీషియా తదితర విభాగాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ అలో సమంతరే, డాక్టర్ రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండడానికే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో పార్టీ నాయకులతో కలసి శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఆరాచక పాలనకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను తీసుకు వచ్చారని, పార్టీ శ్రేణులపై జరిగే దాడులను మొబైల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటికి పరిష్కారం చూపిస్తారన్నారు. అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. 040-49171718కు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యకర్తలను కాపాడుకోవడానికి పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. డిజిటల్ బుక్‌ను గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి కూటమి నేతల అరాచకాలను ఎండగట్టాలని కోరారు. కూటమి నాయకులు గ్రామాల్లో చేసిన అన్యాయాలను, అక్రమాలను ఇందులో నమోదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బందిల సురేష్, శివా యాదవ్, సీనియర్ నాయకులు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, కుమారస్వామి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యవర్గ సభ్యుడు అబ్దుల్, సోషల్ మీడియా విభాగం జిల్లా కార్యదర్శి శోభన్ యాదవ్, జిల్లా మహిళా కార్యదర్శి కవిత, బాలకృష్ణ, ప్రతాప్, వీరాస్వామి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భూరికార్డుల ఆధునీకరణ

సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా ఎల్పీఎం సంఖ్యలను ప్రవేశపెట్టడం ద్వారా భూరికార్డులు ఆధునీకరణ జరగుతుందని డీటీ త్యాగరాజు అన్నారు. శనివారం సత్యవేడు సచివాలయంలో రైతుల గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో డీటీ త్యాగరాజు మాట్లాడుతూ సత్యవేడు రెవెన్యూ భూములను సర్వే చేయనున్నట్లు తెలిపారు. సత్యవేడు పరిధిలోని 870 ఎకరాలు భూమికి చెందిన 320 మంది రైతులు భూములు సర్వే చేస్తామన్నారు. సర్వేలకు రైతులు సహకరించాలని ఆయన కోరారు. సత్యవేడు రెవెన్యూ పరిధిలోని భూములను ఆదివారం నుంచి రీ సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు త్రివేణి, సుధా, పి. వినోద్‌కుమార్, సర్వేయర్లు మురళి, గణేష్, చందు, రైతులు వెంకటేశ్వర్లు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూఎంకు సన్మానం



సీడబ్ల్యూఎంను సత్కరిస్తున్న శెట్టిపల్లి వాసులు

రేణిగుంట: తిరుపతి సౌత్ సెంట్రల్ రైల్వే వర్క్‌షాప్ మేనేజర్‌గా దైవ సహాయం మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహించి, ఉద్యోగోన్నతిపై బెంగళూరులోని ఆర్ఆర్‌బీ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం శెట్టిపల్లి గ్రామస్తులు ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు. సీడబ్ల్యూఎం మాట్లాడుతూ 2022 చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ తిరుపతి బ్రాంచ్ సెలెక్ట్ అయ్యి, సీఆర్ఎస్ లో మూడేళ్ల పాటు వర్క్‌షాప్‌లో అందరి సహకారంతో అనేక సంస్కరణలు చేయగలిగానని తెలిపారు. స్థానిక శెట్టిపల్లి గ్రామస్తులతో విడ తీయరాని బంధం ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగి కాళహస్తి ధనంజయ్, శెట్టిపల్లి ఉప సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాల మురళి కృష్ణ, కృష్ణమూర్తి, శంకర్, మోహన్, గోపి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు రక్షణ కల్పించండి



ఆక్రమిత భూమి వద్ద నిరసన తెలుపుతున్న వీకేఆర్‌వై కాలనీ గిరిజనులు

వరదయ్యపాళెం: తమ భూములకు రక్షణ కల్పించాలని మండలంలోని వీకేఆర్‌వై కాలనీకి చెందిన గిరిజనులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆ మేరకు కాలనీకి ఆనుకుని ఉన్న కొంత భూమిని ఇటీవల స్థానికేతరులు కొందరు దౌర్జన్యంగా రాత్రికిరాత్రే జేసీబీలతో చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని వారు వాపోయారు. అంతేకాక అడ్డుకునేందుకు వెళ్లిన గిరిజనులపై దాడులకు తెగబడుతూ బెదిరింపులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తమ కాలనీలో ఇళ్ల స్థలాలు లేక అవస్థలు పడుతున్నట్లు వారు తెలిపారు. అంతేకాక ఒకే ఇంట్లో ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది నివాసం ఉంటూ అన్నింటికీ అవస్థలు పడుతున్నామన్నారు. అర్హత కలిగిన వారికి కాలనీకి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామివారికి పెరటాశి నెల మూడో శనివారం కావటంతో భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు చేసి పుర వీధుల్లో ఊరేగించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. గ్రామస్తులు, భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను ఊరేగించారు.



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెద్దపాలేడు వాసుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పదో మైలు అర్చి రోడ్డు నుంచి పెద్దపాలేడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉండడంతో శనివారం గ్రామస్తులు రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో ఉపాధి హామీ పథకంలో తారు రోడ్డు మంజూరైంది. గత టీడీపీ ప్రభుత్వంలో తారురోడ్డు వేయడం కోసం మెటల్ వేసి, తారు వేయలేదన్నారు. దీంతో మెటల్ కొట్టుకుపోవడంతో రోడ్డంతా గుంతలమయమై అధ్వాన్నంగా తయారై ఉందని తెలిపారు. ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడంతో అధ్వాన్నంగా తయారైందని, వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా తయారవుతుందని వాపోయారు.

వీధుల్లో నీళ్లు.. ప్రజలకు ఇక్కట్లు





ఆర్ మల్లవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



గుత్తివారిపల్లిలో రోడ్డుపై నిలిచిన నీరు

రేణిగుంట: మండలంలో శనివారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గుత్తివారిపల్లిలోని ప్రధాన రహదారికి పక్కన కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచియాయి. ఆర్ మల్లవరంలో పంట కాలవల్లో వచ్చే నీరు రోడ్లపైనే ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఆ రహదారులు రాకపోకలు వాహనచోదకులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో యాత్రకులు ఇబ్బందులు పడ్డారు.

బస్సులు రాక ప్రయాణికుల ఇక్కట్లు



రేణిగుంట బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

రేణిగుంట: పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం సాయంత్రం బస్సులు సకాలంలో రాక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. శనివారం కావడంతో రేణిగుంట సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడం వచ్చిన బస్సు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో అనేకమంది ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించి ప్రయాణించారు. శని, ఆదివారాలల్లో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరారు.



బస్సు రాకపోవడంతో ఆటోల్లో వెళుతున్న ప్రయాణికులు

పదవి ఎవరికో.. పళ్లికొండేశ్వరా?



వరదయ్యపాళెం: నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తవుతున్నా పళ్లికొండేశ్వరాలయానికి పాలక మండలి భర్తీ కాలేదు. దీంతో పదవీ వ్యామోహంలో ఉన్న పలువురు కీలక నేతలు ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ కమిటీ, సింగిల్ విండో చైర్మన్ల నియామకం జరిగింది. అంతేకాక జిల్లాలో పలు ఆలయాలకు పాలక మండళ్లను సైతం నియమించారు. ఈ నేపథ్యంలో సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయానికి సైతం పాలక మండలిని నియమించే ప్రక్రియ పూర్తవుతుందని ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన నియోజకవర్గ టీడీపీ నేతల ఆశలు అడియాసలయ్యాయి. నియోజకవర్గంలో ఇప్పటికే జరుగుతున్న పరిణామాలు దృష్ట్యా అధికార టీడీపీలో రాజకీయ అనిశ్చిత నెలకొంది. ఓవైపు కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం సస్పెండ్‌కు గురికావడం, తాజాగా నియోజకవర్గ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా వ్యాపారవేత్త కూరపాటి శంకర్ రెడ్డిని నియమించడంతో నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వెంట నడిచిన నేతలు పూర్తిగా ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ వైపు వెళ్లడం మిగిలిన కొద్ది మందితో ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార కూటమి నాయకుల్లో పరిస్థితులు తారుమారయ్యాయి.

పోటీలో వీరే..

సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ రేస్‌లో కేవీబీపురం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు రామాంజుల నాయుడు, పిచ్చాటూరు మండలానికి చెందిన పద్మనాభరాజు, ఇళంగోవన్ రెడ్డి, నాగలాపురం మండలానికి చెందిన యాచేంద్ర నాయుడు, సత్యవేడు మండలానికి చెందిన వీకే పరమశివం పోటీలో ఉన్నారు. వీరు వారివారి రాజకీయ గాడ్‌ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఏ వర్గాన్ని వరించేనో?

కీలక నామినేటెడ్ పదవి అయిన సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయ పాలక మండలి చైర్మన్ పదవి అటు ఎమ్మెల్యే వర్గానికి చెందిన వ్యక్తిని వరిస్తుందా? లేక ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తిని వరిస్తుందా? అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. చైర్మన్ రేసులో ఉన్న నాయకుల్లో పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ మార్కెటింగ్ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యే ఆదిమూ లం వెంట నడుస్తున్నారు. ఆయన ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన నలుగురు నాయకులు అటు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ద్వారా, ఇటు పార్టీ పెద్దల ద్వారా ఎవరికి వారు ప్రయత్నాలు ము మ్మరం చేస్తున్నారు. అయితే చివరగా పళ్లికొండేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఎవరిని వరిస్తాయో వేచి చూడాలి మరి.

అందరిని సమన్వయ పరిచేనా?:

ఆలయ చైర్మన్ పదవి రేసులో ఐదుగురు కీలక నేతలు పోటీలో ఉన్నారు. అందులో రామాంజుల నాయుడు, పద్మనాభరాజు, వీకే పరమశివం, యాచేంద్ర నాయుడులు నియోజకవర్గ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి ద్వారా ఎవరికివారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే వీరందరినీ సమన్వయం చేసి చైర్మన్ పదవిని సామరస్యంగా ఎంపిక చేయడం శంకర్ రెడ్డికి పెను సవాల్‌గా మారనుంది. అయితే ఈ ప్రక్రియలో ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఏమాత్రం సక్సెస్ అవుతారో చూడాలి మరి. ఏది ఏమైనప్పటికీ ఈ పదవి ఎంపిక గురించి నియోజకవర్గంలో కూటమి శ్రేణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.